Digital, tmedia.net.in

# టీ-మీడియా

tmedia.net.in

సామాజికం.. ప్రజల పక్షం...

నిజం మా లక్ష్యం... ప్రజలే మా శక్తి...

11వ వార్షికోత్సవం 2016 - 2026

మీ ఆదరణ... మా ప్రేరణ... ధన్యవాదాలు!

సంపుటి : 8
సంచిక :336
పేజీలు : 5

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

ఆదివారం 16/08/2026 టీమీడియా మెయిన్ ఎడిషన్ ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## స్వాతంత్ర్య వేడుకల్లో మంత్రి ఆనంకు అస్వస్థత

● ప్రాథమిక చికిత్స అందించిన వైద్యులు

**టీ మీడియా, ఆగస్టు 15, తిరుపతి :**
తిరుపతి పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకలకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జాతీయ పతాకాన్ని ఎగురవేసిన అనంతరం ప్రసంగిస్తున్న సమయంలో కళ్లు తిరిగి ఒక్కసారిగా పక్కకు వాలిపోయారు. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది మంత్రి కింద పడకుండా పట్టుకున్నారు. సకాలంలో స్పందించిన వైద్యులు మంత్రికి ప్రాథమిక చికిత్స అందించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి



నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. కాసేపటి తర్వాత మంత్రి ఆనం స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్నారు.

# రేషన్‌కార్డు ఆకలి తీర్చే కార్డు

● సీఎం రేవంత్‌రెడ్డి

● సంగారెడ్డిలో స్మార్ట్ కార్డుల పంపిణీ

**టీ మీడియా, ఆగస్టు 15, సంగారెడ్డి :**
రేషన్ అనే వ్యవస్థను ప్రారంభించిందే కాంగ్రెస్ పార్టీ అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రేషన్‌కార్డు అనేది కేవలం బియ్యం తెచ్చిపెట్టే సాధనం కాదని, ఈ కార్డు అనేది ఆత్మగౌరవమని సీఎం స్పష్టం చేశారు. ఎక్కడికి వెళ్లినా మీ ఆకలి తీర్చే కార్డని చెప్పారు. ఇందిరాగాంధీని ఆదర్శంగా తీసుకొని పేదలకు సంక్షేమాన్ని అందిస్తున్నామని చెప్పారు. రేషన్‌లో సన్న బియ్యం ఇవ్వడంతోనే మార్కెట్‌లో బియ్యం రేట్లు తగ్గాయని సీఎం చెప్పారు.ముఖ్యమంత్రి రేవంత్?రెడ్డి సంగారెడ్డిలో తొలుత మాజీ ప్రధానులు నెహ్రూ, రాజీవ్‌గాంధీ విగ్రహాలను



ఆవిష్కరించారు. అనంతరం అంబేద్కర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్?కుమార్?రెడ్డి, మంత్రులు వివేక్ వెంకట స్వామి, దామోదర రాజనర్సింహ, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డితో కలిసి స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.



**కేసీఆర్ వందలాది ఎకరాల్లో వరి పండిస్తున్నారు**

వరి వేసుకుంటే, ఉరి వేసుకున్నట్లే అని ఆనాడు కేసీఆర్ అన్నారని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. కేసీఆర్ మాత్రం వందలాది ఎకరాల్లో వరి పండిస్తున్నారని రేవంత్? చెప్పారు. కాంగ్రెస్? ప్రభుత్వం రూ.500 బోనస్ ఇచ్చి మరి వడ్లు కొంటున్నామన్నారు. 32 నెలల్లో 70 లక్షల రైతుల ఖాతాల్లో రూ.36 వేల కోట్ల రైతుబంధు నిధులు వేశామని చెప్పారు. రెండుసార్లు సీఎం అయినా, కేసీఆర్ రైతు రుణమాఫీ చేయలేదని రేవంత్?రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతు రుణమాఫీ చేశామని సీఎం తెలిపారు. అప్పులు లేని రైతులు తెలంగాణలో ఉన్నారని కేంద్రప్రభుత్వమే చెప్పిందని సీఎం తెలిపారు. 32 నెలల్లో (మిగతా 2లో)

# మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అందాలి

## ఆ క్రెడిట్ విపక్షాలే తీసుకోవాలి: ప్రధాని మోదీ



**టీ మీడియా, ఆగస్టు 15, ఢిల్లీ బ్యూరో :**
చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో అన్ని రాజకీయ పార్టీలు కలిసి రావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. మహిళలకు రాజకీయాల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించడం దేశ ప్రగతికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ల అమలుకు విపక్షాలు సహకరించాలని కోరారు. ఈ నిర్ణయం అమల్లోకి వస్తే దాని క్రెడిట్‌ను కూడా విపక్షాలే తీసుకోవచ్చని అన్నారు. ఢిల్లీలోని ఎర్రకోటపై జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం జాతిని ఉద్దేశించి చేసిన ప్రసంగంలో ప్రధాని మహిళా రిజర్వేషన్లపై మాట్లాడారు.

**మహిళల భాగస్వామ్యం కీలకం**

దేశ విధానాలను రూపొందించడంలో మహిళా నాయకత్వం అత్యంత అవసరమని మోదీ అన్నారు. పంచాయతీలు, పురపాలక సంఘాలు, మున్సిపల్ కార్పొరేషన్లలో మహిళా ప్రజాప్రతినిధులు సమర్థవంతంగా పనిచేస్తున్నారని చెప్పారు. స్థానిక సమస్యలను పరిష్కరించడంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని ప్రశంసించారు. వారి నాయకత్వం ప్రజలకు సాధికారత కల్పిస్తోందని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో (మిగతా 2లో)

# మన చేతిలో జాతీయ జెండా

● గుండెల్లో బలమైన అజెండా ఉండాలి

● సీఎం చంద్రబాబు

**టీ మీడియా, ఆగస్టు 15, అమరావతి బ్యూరో :**
మన చేతిలో జాతీయ జెండా ఉండాలి, గుండెల్లో దేశం కోసం బలమైన అజెండా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎలుగెత్తి చాటారు. రాజధాని అమరావతిలోని రాయపూడి పరేడ్ మైదానంలో తొలిసారిగా నిర్వహించిన 80వ స్వాతంత్ర్య వేడుకలకు ముఖ్యమంత్రి హాజరై జాతీయజెండాను ఎగురవేశారు. సీడ్ యాక్సెస్ రోడ్డు మీదుగా స్వాతంత్ర్య వేడుక జరిగే వేదిక వద్దకు సీఎం కాన్వాయ్‌తో పాటు బుల్లెట్ ఎస్కార్టు వచ్చింది. డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఇతర ఉన్నతాధికారులు సీఎంకు స్వాగతం పలికారు. జాతీయ పతాకాన్ని ఎగురవేసి వందనం సమర్పించారు. పోలీసు దళాలు ముఖ్యమంత్రికి గౌరవ వందనం సమర్పించారు. ఏపీఎస్పీ సహా వివిధ పోలీసు దళాల సన్నద్ధతను సీఎం సమీక్షించారు. పోలీసు బలగాలు, ఎన్సీసీ క్యాడెట్లు, సీఆర్పీఎఫ్, కర్ణాటక పోలీసు దళం మార్చ్ పాస్ట్ నిర్వహించారు.ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ తెలుగు నేల కూడా స్వాతంత్ర్య సమరంలో తనదైన ముద్ర వేసిందన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేళ ఏపీ ప్రజలతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ ముఖ్యమంత్రి చంద్రబాబు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.



ఎందరో మహనీయుల త్యాగాలు, పోరాటాల ఫలితమే మన స్వాతంత్ర్యమని అన్నారు. వారి త్యాగాలకు నిజమైన నివాళి అంటే దేశ భవిష్యత్తును మరింత గొప్పగా నిర్మించడమేనన్నారు. (మిగతా 2లో)

# యాదిగిరిగుట్ట ప్రసాదంలో నాణ్యతాలోపం

● మచ్చుకైనా కనిపించని జీడిపప్పు

● పసుపు కలిపిన అన్నంగా పులిహోర

**టీ మీడియా, ఆగస్టు 15, యాదిగిరిగుట్ట :**
తెలంగాణ తిరుమలగా పేరుగాంచిన క్షేత్రంలో నమ్మిన భక్తులు వెన్నంటి ఉండే ఆప్పుడు నారసింహుడి ఆలయంలో స్వామివారి ప్రసాదంలో నాణ్యతాలోపం కనిపిస్తోంది. ఈ క్షేత్రానికి తెలంగాణ నుంచే కాకుండా అనేక ప్రాంతాల నుంచి భక్తులు తరలి వస్తారు. హైదరాబాద్?కు చేరువలో ఉండటంతో వారాంతాల్లో ఆలయానికి భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. పండుగలు, పర్వదినాలు, సెలవు రోజుల్లో స్వామివారి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివస్తారు. ఇంతటి ప్రాముఖ్యం కలిగిన ఆలయంలో ప్రసాదాల సమస్యపై భక్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే,యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి లడ్డూ, పులిహోర, అన్న ప్రసాదంలో నాణ్యత లోపిస్తోంది. సరకుల నాణ్యత లేమి, అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా రుచి తగ్గుతోంది. తిరుమల వేంకటేశ్వర స్వామి వారి లడ్డూ ప్రసాదం మాదిరి అదే స్థాయి నాణ్యతా ప్రమాణాలతో తయారు చేయాలని ప్రభుత్వం భావించింది. దీనికోసం అత్యాధునిక యంత్రాలు ఏర్పాటు చేసినా ప్రసాదం నాణ్యత నాసిరకంగా ఉంటోంది. పులిహోర ప్రసాదం పేద, సామాన్య



భక్తుల ఆకలిని తీర్చే వరప్రసాదంగా భావిస్తారు. ఇంతటి ప్రాముఖ్యత కలిగిని ఈ ప్రసాదాల తయారీలో అశ్రద్ధ, ఉపయోగించాల్సిన సరుకులు తక్కువగా వినియోగించడం, నాణ్యత లోపించడంతో ప్రసాదం రుచికి గండి పడుతుందనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

**పసుపు కలిపిన అన్నంగా పులిహోర**

స్వామివారి దర్శనానికి ఆలయానికి అధిక సంఖ్యలో వచ్చేది సామాన్య భక్తులే. వీరంతా స్వామివారి అన్న ప్రసాదం, పులిహోర వంటివి కళ్లకు అద్దుకొని తీసుకుంటారు. వీరికి 200 గ్రాముల బరువు కలిగిన ప్రసాదం ఓ వరమనే చెప్పాలి. అలాంటిది పులిహోర ప్రసాదంలో పులుపు కోసం వినియోగించే చింత పండును తగ్గించారు. ఇక ఎండు మిర్చిని వెతుక్కోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అంటే ఏ పరిమాణంలో వినియోగిస్తున్నారో అర్థమవుతోంది. ఇతర మసాలా దినుసులూ కనిపించడం లేదు. దీంతో పులిహోర ప్రసాదం అంటే కేవలం పసుపు కలిపిన అన్నం మాదిరిగానే ఉంటోందని భక్తులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**బరువు, నాణ్యత తగ్గుముఖం**

ఇక లడ్డూ ప్రసాదం (మిగతా 2లో)

# మా ప్రభుత్వ 32 నెలల కృషి ఇప్పుడిప్పుడే కనిపిస్తోంది

● సీఎం రేవంత్ రెడ్డి

**టీ మీడియా, ఆగస్టు 15, హైదరాబాద్ బ్యూరో :**
విధ్వంసమైన రాష్ట్రాన్ని వికాసం వైపు నడిపించేందుకు ప్రయత్నిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన 32 నెలల్లో దెబ్బతిన్న వ్యవస్థలను ఒక్కొక్కటిగా గాడిలో పెడుతూ సంక్షేమాన్ని విస్తరించామన్నారు. తమ ప్రభుత్వ 32 నెలల కృషి ఇప్పుడిప్పుడే కనిపిస్తోందని చెప్పారు. రాష్ట్ర భవిష్యత్తుకు అవసరమైన కార్యాచరణను సిద్ధం చేసుకుంటూ ముందుకు వెళుతున్నామని సీఎం స్పష్టం చేశారు.

హైదరాబాద్‌లోని చారిత్రక గోల్కొండ కోటలో ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. ప్రపంచ చరిత్రలోనే ఆయుధం లేని యుద్ధం మన స్వాతంత్ర్య పోరాటమని అభివర్ణించారు. అహింసతో విజయాన్ని సాధించవచ్చని



మహాత్మాగాంధీ నిరూపించారని తెలిపారు. ఈ క్రమంలోనే పేదవాడి పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యతగా ఉందన్న రేవంత్ రెడ్డి, వారికి ఆత్మగౌరవంతో కూడిన జీవన విధానాన్ని అందించే సంకల్పంతో ముందుకు సాగుతున్నామన్నారు. ఓట్ల కోసమో, మొక్కుబడి హామీలుగానో సంక్షేమాన్ని చూడటం లేదన్న సీఎం, ప్రతి పథకంలో శాస్త్రీయ దృక్పథం ఉందని వెల్లడించారు.

**రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు చేశాం**

వ్యవసాయాన్ని పండగ చేయాలని ఈ ప్రభుత్వం నిర్ణయించిందని, రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లు రైతులకు అందించామని గుర్తు చేశారు. మొత్తంగా రైతు సంక్షేమం కోసం రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు చేశామని అన్నారు. ధాన్యం ఉత్పత్తిలో రాష్ట్రం సరికొత్త రికార్డులు అధిగమించిందని పేర్కొన్న రేవంత్? రెడ్డి, దేశ తలసరి ఆదాయం కంటే రాష్ట్రంలో 92 శాతం అధికంగా ఉందని తెలిపారు.

**నీళ్ల విషయంలో రాజీపడేదే లేదు**

రాష్ట్ర నీటి హక్కుల విషయంలో రాజీ పడేది లేదని స్పష్టం చేశారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి రైతుల కళ్లల్లో ఆనందం చూస్తామని, త్వరలోనే పాలమూరు ప్రాజెక్టు పూర్తి చేసి నీరు అందించనున్నామని తెలిపారు. వ్యవసాయంతో పాటు నివాసాలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని అన్నారు. కల్యాణలక్ష్మి (మిగతా 2లో)

# ఘనంగా పంద్రాగస్టు వేడుకలు



● తెలంగాణవ్యాప్తంగా రెపరెపలాడిన మువ్వన్నెల జెండా

**టీ మీడియా, ఆగస్టు 15, హైదరాబాద్ బ్యూరో :**
తెలంగాణలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. (మిగతా 2లో)

# రేషన్‌కార్డు ఆకలి తీర్చే కార్డు

(మొదటి పేజీ తరువాయి)

వడ్డు కొని రూ.90 వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేశామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 6 నెలలకు ఒకసారి ఉద్యోగ నోటిఫికేషన్లు కేసీఆర్? కుటుంబంలో అందరికీ ఉద్యోగాలు వచ్చాయని, రాష్ట్రంలో యువతకు మాత్రం కేసీఆర్ ఉద్యోగాలు ఇవ్వలేదని సీఎం రేవంత్?రెడ్డి విమర్శించారు. 6 నెలలకు ఒకసారి ఉద్యోగ నోటిఫికేషన్లు వస్తాయని, నిరుద్యోగులు చదువుకోవాలని కోరారు. నిరుద్యోగులు ఎవరి ప్రలోభాలకు గురికావద్దని సూచించారు. యువతకు ఉద్యోగాలు ఇచ్చి, ఆదుకునే బాధ్యత తమదని హామీ ఇచ్చారు.

**విధ్వంసం నుంచి వికాసం వైపు**

కేసీఆర్ చేసిన రూ.8 లక్షల 11 వేల కోట్ల అప్పులకు ఏడాదికి రూ.75 కోట్ల వడ్డీ కడుతున్నామని సీఎం రేవంత్?రెడ్డి తెలిపారు. విధ్వంసం నుంచి వికాసం వైపు రాష్ట్రాన్ని తీసుకెళ్తున్నామన్నారు. సంక్షోభంలో ఉన్నా సంక్షేమం కొనసాగిస్తున్నామని చెప్పారు. 12 ఏళ్ల బీజేపీ పాలన, 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలన, రెండేళ్ల కాంగ్రెస్? పాలనను పోల్చి చూడాలని ప్రజలను కోరారు. ఎల్‌నినో ఉన్నా దేవుడి దయవల్ల కృష్ణా నదిలోకి పుష్కలంగా నీళ్లు వచ్చాయని ముఖ్యమంత్రి రేవంత్? ఆనందం వ్యక్తం చేశారు. దేవుడి దయ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందని, ఎన్ని చేతబడులు చేసినా ఏం కాదన్నారు.

**జగ్గారెడ్డి లాంటి నాయకుడు దొరకడు**

రాహుల్‌గాంధీ రాముడు అయితే జగ్గారెడ్డి హనుమంతుడని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఓడిపోయినా ప్రజల మధ్యే జగ్గారెడ్డి తిరుగుతున్నారని, రూ.1000 కోట్లు ఇచ్చినా జగ్గారెడ్డి లాంటి నాయకుడు దొరకడని రేవంత్? అన్నారు. నాయకులకు మార్కులు వేస్తే, తన కన్నా మంచి మార్కులు జగ్గారెడ్డికి వస్తాయని అన్నారు.

# యాదిగిరిగుట్ట ప్రసాదంలో నాణ్యతాలోపం

(మొదటి పేజీ తరువాయి)

విషయానికొస్తే రూ. 150లకు విక్రయించే అభిషేకం లడ్డూ ప్రసాదం 500 గ్రాముల బరువు ఉండగా రూ. 30కి విక్రయించే లడ్డూ ప్రసాదం 100 గ్రాముల బరువు ఉంటుంది. కాగా 100 గ్రాముల చిన్న లడ్డూలు బరువుతో పాటు నాణ్యతలోనూ తగ్గుముఖం పట్టాయని భక్తులు చెబుతున్నారు.

**మచ్చుకైనా కనిపించని జీడిపప్పు**

గతంలో మాదిరి ఈ లడ్డూ ప్రసాదం ఎక్కువ రోజులు నిల్వ ఉండటం లేదని అనేక మంది భక్తులు ఫిర్యాదు చేస్తున్నారు. లడ్డూలో అధిక శాతం తేమ ఉండటంతో పట్టుకోగానే చితికిపోతోందని అంటున్నారు. ఎండు ద్రాక్షలు, జీడిపప్పు మచ్చుకైనా కనిపించవని వివరిస్తున్నారు. భక్తులకు అందించే నిత్య అన్నదాన ప్రసాద నాణ్యతపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**బియ్యంలో నాణ్యత లోపం**

విస్తరిలో వేసిన మజ్జిగను అన్నంలో కలిపేందుకు ఎంత ప్రయత్నించినా కలవడం లేదని భక్తులు చెతున్నారు. అన్నం కలుపుతుంటే జారిపోయి కిందకి పడుతోందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. వీటి ఆధారంగా నిత్యాన్నదానంలో వినియోగించే బియ్యంలో నాణ్యత లోపం స్పష్టమవుతోంది. అయినప్పటికీ ఇక్కడి అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# మా ప్రభుత్వ 32 నెలల కృషి ఇప్పుడిప్పుడే కనిపిస్తోంది

(మొదటి పేజీ తరువాయి)

కింద ఆడబిడ్డలకు రూ.4,790 కోట్లు అందజేశామని గుర్తు చేశారు. తెలంగాణ ఆడబిడ్డలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు.ం

**కొత్త రేషన్‌కార్డుల పంపిణీ**

కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే ఉక్కు సంకల్పంతో ఉన్నామని, మహిళలను ఆర్టీసీ అద్దె బస్సులకు యజమానులుగా చేశామని గుర్తు చేశారు. 15 లక్షలకు పైగా కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేశామని, కొత్త రేషన్ కార్డుల పంపిణీని ఇవాళే ప్రారంభించుకుంటున్నామని తెలిపారు. పేదల ఆత్మగౌరవం నిలబెట్టేలా ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామని, రెండో విడతలో 5.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. ఈ ఏడాది పట్టణ ప్రాంత పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని, క్యూర్ పరిధిలో ఇందిరమ్మ టవర్లు నిర్మించి అందించనున్నామని వెల్లడించారు. కొత్తగా 2.50 లక్షల మందికి పింఛన్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు.

**ఆన్‌లైన్ విధానంలో ప్రజావాణి**

ఈ నెల 17 నుంచి అన్ని మండలాల్లో ప్రజావాణి నిర్వహిస్తామన్న సీఎం, ప్రతి సోమవారం అన్ని మండల కేంద్రాల్లో ప్రజావాణి ఉంటుందని తెలిపారు. త్వరలోనే ఆన్‌లైన్ విధానంలో ప్రజావాణి నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు ఎక్కడి నుంచైనా ఫిర్యాదులు, దరఖాస్తులు ఇవ్వొచ్చని తెలిపారు. చెరువులు, ప్రభుత్వ భూములు రక్షించేందుకే హైడ్రా ఏర్పాటు చేశామని, చెరువులను ప్రక్షాళన చేసి నైట్ ఎకానమీని అభివృద్ధి చేస్తామని తెలిపారు.

**పరిశ్రమలు, పెట్టుబడులకు అత్యంత ప్రాధాన్యత**

ఇస్తున్నామని, టీఎస్ ఐపాస్ ద్వారా రూ.1.95 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామన్నారు. మరో 78 వేలకు పైగా ఉద్యోగ అవకాశాలు రాబోతున్నాయని పేర్కొన్నారు. ప్రఖ్యాత సంస్థలు హైదరాబాద్ జీసీసీలు ఏర్పాటు చేస్తున్నాయని, హైదరాబాద్? నగరంలో ఇప్పటికే 355కు పైగా జీసీసీలు పని చేస్తున్నాయని, గత 6 నెలల్లోనే హైదరాబాద్‌లో 40 జీసీసీలు ఏర్పాటయ్యాయని వివరించారు. అమెజాన్ సంస్థ రాష్ట్రంలో 7 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెడుతోందని స్పష్టం చేశారు.

**కొత్త మెడికల్ కాలేజీలకు భవనాలు నిర్మిస్తున్నాం**

వృద్ధ తల్లిదండ్రుల కోసం కూడా చట్టం చేసిన తొలి రాష్ట్రం తెలంగాణ అని సీఎం గుర్తు చేశారు. విద్యారంగంలో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు ఫలితాలు ఇస్తున్నాయని, విద్యా సూచీలో 21వ స్థానంలో ఉన్న తెలంగాణ 14కు చేరుకుందని, నియోజకవర్గానికొక ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణాన్ని చేపట్టామని, వందకు పైగా తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ నిర్మించే లక్ష్యంతో ఉన్నామని పేర్కొన్నారు. మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకు సీఎం కప్ పోటీలు నిర్వహించామని గుర్తు చేశారు. త్వరలో జరిగే ఖేలో ఇండియా పోటీలకు హైదరాబాద్ ఆతిథ్యం ఇస్తుందని, విద్య, వైద్యం ఈ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్య అంశాలని చెప్పారు. ఇప్పటికే ఉస్మానియా కొత్త ఆస్పత్రి నిర్మాణంలో ఉందని, 8 కొత్త మెడికల్ కాలేజీలకు భవనాలు నిర్మిస్తున్నామని వెల్లడించారు.

# ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు






**రెపరెపలాడిన మువ్వన్నెల జెండా**

**విద్యార్థులకు నగదు పురస్కారాలు**

**టీ మీడియా,ఆగస్ట్15,సింగరేణి(కారేపల్లి):**

ఖమ్మం జిల్లా సింగరేణి మండలంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి.మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు,గ్రామపంచాయతీల్లో జాతీయ పతాకాలను ఆవిష్కరించి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు.

**ప్రభుత్వ కార్యాలయాల్లో**

సింగరేణి(కారేపల్లి) తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు,ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో పద్మ,ఎంఆర్సీలో ఎంఈవో దుగ్గిరాల జయరాజు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు.ఆయా కార్యాలయాల్లో అధికారులు,సిబ్బంది జాతీయ జెండాకు వందనం చేశారు.కారేపల్లి సొసైటీ కార్యాలయంలో సీనియర్ డైరెక్టర్ అడ్డగోడ ఐలయ్య,పోలీస్ స్టేషన్‌లో ఎస్సై బైరు గోపి, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, కేజీబీవీలో స్పెషల్ ఆఫీసర్ ఝాన్సీ సౌజన్య, మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ ప్రేమ్ కుమార్ జాతీయ పతాకాలను ఆవిష్కరించారు.మండలంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలు,పాఠశాలలు,ఆటో యూనియన్, వర్తక సంఘం ఆధ్వర్యంలోనూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు.

**విద్యార్థులకు నగదు పురస్కారాలు**

కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కళాశాల స్థలదాతలు నేదునూరి విఠల్,నేదునూరి నరేష్ తమ తల్లిదండ్రులు,స్వాతంత్ర్య సమరయోధులు నేదునూరి వీరరాఘవులు జ్ఞాపకార్థం నగదు పురస్కారాలు అందజేశారు.ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో టాపర్లుగా నిలిచిన ఏడుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.1,000 చొప్పున మొత్తం రూ.7 వేలు అందజేశారు.వేడుకలకు హాజరైన ఎన్ఆర్ఐ భయ్యా శ్రీలత వచ్చే ఏడాది నుంచి ప్రతిభ చూపిన విద్యార్థులకు రూ.25 వేల నగదు పురస్కారం అందజేస్తానని హామీ ఇచ్చారు.

**లిదుబ్బతండా, మేకల తండా లో**

దుబ్బతండా గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అంగోత్ మత్రు నాయక్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.సర్పంచ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో మహనీయుల త్యాగాలు,పోరాటాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం లభించిందన్నారు.దేశ ఐక్యత,సమగ్రతను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యతని పేర్కొన్నారు.ప్రజల సహకారంతో మౌలిక వసతులు,పారిశుద్ధ్యం,తాగునీరు,విద్యకు ప్రాధాన్యతనిస్తూ గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.అనంతరం మేకలతండాలోని బాలికల హాస్టల్‌లో 2025 సంవత్సరానికి సంబంధించి పదో తరగతి పరీక్షల్లో మొదటి ర్యాంకు సాధించిన అజ్మీర సుమతికి సర్పంచ్ అంగోత్ మత్రు నాయక్ రూ.2 వేల నగదు బహుమతిని అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమాల్లో ఉప సర్పంచ్ భూక్య బాబి,గ్రామపంచాయతీ సిబ్బంది,హాస్టల్ కరస్పాండెంట్, వార్డెన్,ఉపాధ్యాయులు,ప్రజాప్రతినిధులు,గ్రామ పెద్దలు, యువత, మహిళలు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అందాలి

(మొదటి పేజీ తరువాయి)

పార్లమెంటులో 'నారీ శక్తి వందన అధినియమ్'ను ఆమోదించినట్లు ప్రధాని గుర్తుచేశారు. అయితే మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలనే ప్రయత్నం గత 40 ఏళ్లుగా ఏదో ఒక కారణంతో రాజకీయ వివాదాలకు బలవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

**నారీ శక్తి వందన అధినియమ్**

'నారీ శక్తి వందన్ అధినియమ్–2023' అమలు ప్రక్రియ ముందుకు సాగలేదు. ఎందుకంటే ఏప్రిల్ 17న లోక్‌సభలో ప్రవేశపెట్టిన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లుకు రాజ్యాంగపరంగా అవసరమైన 'సభకు హాజరై, ఓటు వేసిన సభ్యుల్లో మూడింట రెండు వంతుల మెజారిటీ' లభించకపోవడంతో ఆ బిల్లు వీగిపోయింది. ఈ బిల్లు శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) చేపట్టడాన్ని ప్రతిపాదించింది.

# ఘనంగా పంద్రాగస్టు వేడుకలు

(మొదటి పేజీ తరువాయి)

లోక్‌భవన్‌లో గవర్నర్ శివప్రతాప్ శుక్లా, గోల్కొండ కోటలో ముఖ్యమంత్రి రేవంత్? రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించగా, ఖమ్మంలో జరిగిన వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఆయా జిల్లాల్లో మంత్రులు పతాకావిష్కరణలు చేశారు. అటు ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, ఇటు పార్టీ కార్యాలయాల్లో ప్రజా ప్రతినిధులు మువ్వన్నెల జెండాను ఎగురవేశారు.

80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా హైదరాబాద్‌లోని లోక్ భవన్‌లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జెండా ఎగురవేసిన అనంతరం ఆయన పోలీస్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. గోల్కొండ కోటలో అధికారికంగా జరిగిన పంద్రాగస్టు వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్? రెడ్డి జెండా ఎగురవేశారు. అంతకుముందు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో అమర జవాన్ల స్థూపం వద్ద సీఎం నివాళు లర్పించారు.

**ఆధునిక వైద్య కేంద్రాలుగా మారుస్తున్నాం**

ఖమ్మంలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి పాల్గొన్నారు. జాతీయ జెండాను ఆవిష్కరించి స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తితో ప్రజా పాలన కొనసాగిస్తున్నామని భట్టి తెలిపారు. ఈసారి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు పెరిగాయని, వారిని మరింత ప్రోత్సహించేలా రూ.200 కోట్ల నిధులతో యంగ్ ఇండియా స్కూళ్లను నిర్మిస్తున్నామని అన్నారు. నాణ్యమైన వైద్య సేవలను ప్రజలకు ఉచితంగా అందిస్తున్నామని, క్యాథలాగ్ ల్యాబ్‌ల్లో ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తున్నామని వివరించారు. జిల్లా ఆస్పత్రులను ఆధునిక వైద్య కేంద్రాలుగా మారుస్తున్నామని స్పష్టం చేశారు.

**జాతీయ జెండాను ఎగురవేసిన గడ్డం ప్రసాద్**

తెలంగాణ రాష్ట్ర శాసనసభ ప్రాంగణంలో సభాపతి గడ్డం ప్రసాద్?కుమార్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఆయనతో పాటు పలువురు శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, కౌన్సిల్ సెక్రటరీ డాక్టర్ వి.నరసింహాచార్యులు, అసెంబ్లీ సెక్రటరీ రేండ్ల తిరుపతి, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. శాసన మండలిలో మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జెండావందనం చేశారు.

యాదగిరిగుట్టలో 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య వేడుకల్లో పాల్గొని జాతీయ జెండా ఆవిష్కరించారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలకు అనుగుణంగా దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.

బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో అధ్యక్షుడు రామచందర్ రావు జాతీయ జెండాను ఎగురవేశారు. స్వాతంత్ర్య వేడుకల్లో కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీలు లక్ష్మణ్, ఈటల రాజేందర్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ పాల్గొన్నారు. హైకోర్టు సీజే అపరేశ్? కుమార్ సింగ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.

# అమరచింత లో ఘర్ ఘర్ తిరంగా




**టీ మీడియా, ఆగస్టు 15, అమరచింత:**

బీజేపీ అమరచింత పట్టణ కమిటీ పిలుపు మేరకు, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పిలుపునందుకుని హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా అమరచింత పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా తిరంగ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ కట్టా దగ్గర నుంచి యూనియన్ బ్యాంక్ వరకు, అక్కడి నుంచి తిరిగి రాజీవ్ గాంధీ కూడలి వరకు సాగిన ఈ తిరంగ ర్యాలీలో జాతీయ జెండాలను చేతబూని దేశభక్తి నినాదాలతో అమరచింత పట్టణాన్ని తిరంగమయం చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ కమిటీ నాయకులు, బీజేపీ కౌన్సిలర్లు, చేనేత సహకార సంఘం కమిటీ సభ్యులు, బీజేపీ సీనియర్ నాయకులు కార్యకర్తలు, యువత, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని తిరంగ ర్యాలీని విజయవంతం చేశారు.స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ, కులమతాలకు అతీతంగా భారతీయులంతా ఐక్యంగా ఉండాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. భారతదేశ ఐక్యత, సమగ్రతను కాపాడుతూ దేశ ప్రగతిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాకారం చేయడంలో యువత కీలక పాత్ర పోషించాలని, దేశ భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# సాంకేతిక విద్య ఉపాధి ఇస్తుంది



**టీ మీడియా, ఆగస్టు 15 ,ఆత్మకూరు:**

వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం జూరాల గ్రామంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా గ్రామ సర్పంచ్ గుడిసె నరసింహ ఉపసర్పంచ్ గోవిందు, అమ్మ ఆదర్శ పాఠశాల ఛైర్మన్ మొగిలమ్మ, గ్రామ పెద్దలు మైమూద్ , మదిలేటి , వార్డు సభ్యులు రాజు, చేతుల మీద ప్రభుత్వం చే ఇవ్వబడిన నాలుగు కంప్యూటర్లను ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ రాబోయే కాలంలో సాంకేతిక విద్య జీవితంలో చాలా అవసరమని, అదే విద్యార్థులకు ఉపాధినిస్తుందని, ఈ సాంకేతిక విద్య నేర్చుకున్న వారికి ఉన్నత స్థితి పోవడానికి ఈ సాంకేతిక విద్యను ఇప్పటినుండి అలవర్చు కోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు రాందాస్ , శివరాజ్ , పాఠశాల ప్రధానోపాధ్యాయులు భానుప్రియ, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాఘవేంద్ర ,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరుద్ర శ్రీనివాస చారికి ఘన సన్మానం



**టీ మీడియా, ఖమ్మం :**
కార్గిల్ యుద్ధంలో దేశం కోసం ప్రాణాలర్పించిన 527 మంది వీర సైనికుల త్యాగాలను స్మరించుకుంటూ నిర్వహించిన కార్గిల్ టైగర్ హిల్ స్టెప్ ఛాలెంజ్ 2026 – ఎడిషన్లో ఖమ్మం పట్టణానికి చెందిన ప్రముఖ వాకర్ ఆరుద్ర శ్రీనివాస చారి విశేష ప్రతిభ కనబరిచారు. కార్గిల్ విజయ్ దివాస్ సందర్భంగా జులై 26న నిర్వహించిన ఈ ఛాలెంజ్‌లో ఆయన ఏకంగా 2,04,919 అడుగులు నడిచి విజయవంతంగా పూర్తి చేశారు. వీర జవాన్లకు నివాళిగా ఆయన చూపిన ఈ దీక్షకు గాను నిర్వాహకుల నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. శ్రీనివాస చారి సాధించిన ఈ అరుదైన విజయం పట్ల నగరంలోని లకారం వాకర్స్ అసోషియేషన్ హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఖమ్మంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో లకారం వాకర్స్ అసోషియేషన్ ప్రతినిధులు, ఇతర సభ్యులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోషియేషన్ సభ్యులు ఉపేందర్, రామారావు, ఈశ్వర్, పిల్లి రాజు, శేషగిరి, వెంకట్, శరత్ చంద్ర, రమేష్‌తో పాటు పెద్ద సంఖ్యలో వాకర్లు పాల్గొన్నారు. దేశభక్తితో కూడిన ఇలాంటి వ్యాయామ సవాళ్లలో స్థానిక వాకర్లు పాల్గొని నగరానికి గుర్తింపు తేవడం అభినందనీయమని లకారం వాకర్స్ ప్రతినిధులు కొనియాడారు.

# ఆటో యూనియన్ నూతన అధ్యక్షుడిగా నాగవల్లి ప్రభాకర్

- ▶▶| డ్రైవర్లకు ఖాకీ చొక్కాల పంపిణీ
- ▶▶| సంక్షేమానికి అండగా ఉంటానని టోనీ హామీ



**టీ మీడియా,ఆగస్ట్15,సింగరేణి(కారేపల్లి):**
కారేపల్లి ఆటో యూనియన్ నూతన అధ్యక్షుడిగా నాగవల్లి ప్రభాకర్ ఎన్నికైన సందర్భంగా సింగరేణి సర్పంచ్ మేదరి వీరప్రతాప్ టోనీ ఆయనతో పాటు నూతన యూనియన్ కమిటీ సభ్యులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆటో డ్రైవర్లకు శు భాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ జన్మదినాన్ని పురస్కరించుకుని సమకూర్చిన ఖాకీ చొక్కాలను ఆటో డ్రైవర్లకు సర్పంచ్ టోనీ పంపిణీ చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు నిత్యం ప్రజలకు సేవలందిస్తూ జీవనోపాధి పొందుతున్నారని పేర్కొన్నారు.వారి సంక్షేమానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు.ప్రభుత్వం ద్వారా ఆటో డ్రైవర్లకు అందే సంక్షేమ పథకాలు,ఇతర ప్రయోజనాలు అర్హులందరికీ అందేలా ప్రత్యేక చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ పతాకావిష్కరణ చేసిన ప్రెస్ క్లబ్అధ్యక్షులు



**టీ మీడియా, ఆగస్టు 15, రామకృష్ణాపూర్:**
క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ లోని రాజీవ్ చౌక్ ప్రెస్ క్లబ్ క్యాతనపల్లి ఆధ్వర్యంలో శనివారం 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పిలమల్ల గట్టయ్య జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది.ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధులను, దేశం కోసం వారు చేసిన త్యాగాలను గుర్తు చేశారు. దేశాభివృద్ధిలో మన వంతు కృషి మనం చేయాలన్నారు. పట్టణ ప్రజలకు, కార్మికులకు ,విద్యార్థులకు, రైతులకు అలాగే ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ అహర్నిశలు కృషి చేస్తున్న రిపోర్టర్లు అందరికీ 80వ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ జెండా ఆవిష్కరణలో ప్రెస్ క్లబ్ సభ్యులందరూ పాల్గొనడం జరిగింది.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**టీ మీడియా ,ఆగస్టు 15, ఆళ్లపల్లి :**
మర్కోడు గ్రామ పంచాయతీ పరిధిలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శుక్రవారం అత్యంత వైభవంగా,ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి గ్రామ పంచాయతీ సర్పంచ్ సుతారి రమాదేవి అధ్యక్షత వహించి, జాతీయ జెండాను ఎగురవేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ సుతారి రమాదేవి మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన మహనీయుల త్యాగాలను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలందరూ ఐకమత్యంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.
?ఈ వేడుకల్లో గ్రామ పంచాయతీ కార్యదర్శి (సెక్రటరీ) వజ్జ రాధాకృష్ణ, ఉపసర్పంచ్ పగలబోయిన సతీష్, వివిధ వార్డుల వార్డు మెంబర్లు, మాజీ ఎంపీపీ పదిగ సమ్మయ్య, సుతారి కృష్ణ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఇందు కుమార్, ఎస్సీ సెల్ కార్యదర్శి లాలు, మహిళా నాయకురాలు కేక్కర్ల సునీత, పర్వీన్ ప్రముఖ వ్యాపారవేత్తలు, వివిధ హోదాల ప్రజాప్రతినిధులు, మండల స్థాయి నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుక



**టీ మీడియా ,ఆగస్టు 15 ,ఆళ్లపల్లి :**
భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల మైలారంలో జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జోగ రాంబాబు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ విద్యార్థులకు దేశభక్తి సందేశాన్ని అందించారు. దేశ అభివృద్ధిలో విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమని, ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ, నిజాయితీ, సేవా భావం మరియు రాజ్యాంగ విలువలను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.ఈ వేడుకల్లో విద్యార్థులు ఆలపించిన దేశభక్తి గీతాలు, చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు మరియు ఇచ్చిన ప్రసంగాలు అందరినీ ఆకట్టుకున్నాయి. వివిధ పోటీలు, కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించి బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి. కుమార్ రాజా, అంగన్వాడీ టీచర్ బాయమ్మ, ఆయా సావిత్రి, గ్రామ పెద్దలు, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# స్వాతంత్ర దినోత్సవ సంబరాలు



- ▶▶| జాతీయ జెండాను . ఆవిష్కరించిన వాసం శ్రీకాంత్

**టీ మీడియా, ఆగస్టు 15, ఆళ్లపల్లి :**
ఆళ్లపల్లి మండల కేంద్రంలోని మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రాంగణంలో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు అత్యంత వేడుకగా, కోలాహలంగా సాగాయి. పినపాక నియోజకవర్గం శాసనసభ్యులు శ్రీ పాయం వెంకటేశ్వర్లు గారి సూచనలు, ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆళ్లపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వాసం శ్రీకాంత్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి సగర్వంగా వందనం సమర్పించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలందరూ కలిసి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, పినపాక నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గారి నాయకత్వంలో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు ఈ వేడుకల్లో స్థానిక ఎస్టై ముత్తునేని సోమేశ్వర్ రాళ్లపల్లి సర్పంచ్ వాసం సుస్మిత యూత్ అధ్యక్షులు వాసం శ్రీకాంత్ వీరితో పాటు మండల స్థాయి కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, గ్రామ పెద్దలు, యువకులు మరియు అభిమానులు విరివిగా హాజరై కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు. అనంతరం స్థానికులకు, పిల్లలకు మిఠాయిలు పంపిణీ చేసి స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**టీ.మీడియా,ఆగస్టు15,చింతూరు:**
చింతూరు లోని తహసిల్దార్ కార్యాలయంలో శనివారం 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను తహసిల్దార్ అర్జున్ రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి జెండా వందనం నిర్వహించారు. మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలు వేశారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధులగురుంచి మాట్లాడుతూ,స్వాతంత్ర్య ఉద్యమం కేవలం బ్రిటిష్ పాలన నుంచి విముక్తి కోసం జరిగిన పోరాటం మాత్రమే కాదని, ప్రజాస్వామ్యం, సమానత్వం, సామాజిక న్యాయం, లౌకికత రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం జరిగిన మహోద్యమమని పేర్కొన్నారు. భారత స్వాతంత్ర్య సమరంలో గిరిజనులు పోషించిన కీలక పాత్రను గుర్తుచేశారు. అల్లూరి సీతారామరాజు వంటి మహనీయుల త్యాగాలు దేశ స్వాతంత్ర్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని పేర్కొన్నారు.దేశ స్వాతంత్ర్యాన్ని సాధించిన మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన స్వాతంత్ర్య దినోత్సవ స్ఫూర్తి అని, ప్రతి పౌరుడికి సమాన హక్కులు, గౌరవం, న్యాయం అందే భారతదేశ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. “వందేమాతరం”, “జనగణమన” గీతాలను ఆలపించి జాతీయ స్ఫూర్తిని చాటుకున్నారు. స్కూలు బాల బాలికలకు చాక్లెట్లు మంచి పెట్టారు. కార్యక్రమంలో చింతూరు డిప్యూటీ తహశీల్దార్ సయ్యద్ హుస్సేన్, కారం సుబ్బారావు, ఆర్ఐ విగ్నేష్, సోడి రామచంద్రం, లక్ష్మణ్,సునిత పెద్దదల సిబ్బంది పాల్గొన్నారు.



# అవార్డు అందుకున్న ఎస్ ఐ వెంకటేశ్ గౌడ్

**టీ మీడియా, ఆగస్టు 15 పెబ్బేరు:**
వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ ఐ వెంకటేష్ గౌడ్ విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ అంకిత భావంతో విధులు నిర్వహిస్తున్న ఆయనకు జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి ఎం ఎల్ ఏ మేఘారెడ్డి ల చేతుల మీదుగా ప్రశంసా పత్రం అవార్డు అందుకున్నారు రాబోయే కాలంలో ఇంకా ఉత్సాహంతో మానవ సేవే మాధవ సేవగా ప్రజాసేవకు పాటు పడాలని సమర్థ వంతంగా విధులు నిర్వహించాలని ఎన్నో పురస్కారాలు అందుకోవాలని అన్నారు.



# రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి సమాన హక్కులు

- ▶▶| డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**టీ మీడియా, ఆగస్టు 15, ఖమ్మం:**
దేశవ్యాప్తంగా 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఖమ్మం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లోస్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కపాల్గొని జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి సమాన హక్కులు, స్వేచ్ఛ, న్యాయం కల్పించే ప్రజాస్వామ్య పాలన అందించడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. మహనీయుల త్యాగాల స్ఫూర్తితో 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని సూచించారు. ఖమ్మం



జిల్లాలో రైతు సంక్షేమం, విద్య, వైద్యం, సాగునీరు, మౌలిక వసతులు, మహిళా సాధికారత, గృహ నిర్మాణం, విద్యుత్, పర్యాటక రంగాల్లో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు.రైతు భరోసా కింద 3,41,913 మంది రైతులకు రూ.427.97 కోట్లు, రుణమాఫీ కింద 1,31,760 మంది రైతులకు రూ.912.10 కోట్లు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా 1,38,790 ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. 27 లక్షల మంది విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించేందుకు మెకనైజ్డ్ కిచెన్లు, ఉచిత అల్పాహార పథకాన్ని ప్రారంభించామన్న ఉప ముఖ్యమంత్రి ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం చేపడుతున్నామని స్పష్టం చేశారు. ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రూ.23.75 కోట్లతో 50 పడకల క్రిటికల్ కేర్ భవనాన్ని పూర్తి చేసి, ఆధునిక వైద్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు.

## వాణి ఐటిఐలో స్వాతంత్ర దినోత్సవ సంబరాలు

**టీ మీడియా, ఖమ్మం :**
వాణి ఐటిఐ కళాశాల సారధి నగర్, ఖమ్మంలో 80వ స్వాతంత్ర దినోత్సవ కార్యక్రమాలు ఘనంగా జరుపుకున్నారు. ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ దరిపల్లి స్వాతి మన జాతీయ జెండాను ఎగరవేశారు.కళాశాల జెండా ఎగరవేసే కార్యక్రమానికి విచ్చేసిన కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ దరిపల్లి కిరణ్ మాట్లాడుతూ ప్రతి ట్రైనీ విద్యార్థిని విద్యార్థి కష్టపడి తమ శ్రమని వృధా చేయకుండా ఇష్టంగా ప్రాక్టికల్స్ మీద ప్రావీణ్యం తెచ్చుకోవాలని తద్వారా కంపెనీలలో మెరుగైన అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని విద్యార్థినీ విద్యార్థులకు సూచించారు.2026–27 విద్యా సంవత్సరమునకు ఐటిఐ కళాశాల యందు అడ్మిషన్లు జరుగుచున్నవి. ట్రేడ్స్: ఎలక్ట్రీషన్, ఫిట్టర్, ఆర్ అండ్ ఏసీ టెక్నీషియన్, డ్రాఫ్ట్ మెన్ సివిల్,మెకానిక్ డీజిల్, హెల్త్ సానిటరీ ఇన్స్పెక్టర్. ఐటిఐ అర్హత: ఎస్ఎస్సి పాస్ ఆర్ ఫెయిల్. కావున ఈ అవకాశాన్ని అర్హత ఉండి జాయిన్ గాని విద్యార్థిని విద్యార్థులు వినియోగించుకుంటారని కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ దరిపల్లి కిరణ్ కోరారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ దరిపల్లి



స్వాతి, వివిధ ట్రేడ్స్ ల ట్రైనింగ్ ఆఫీసర్స్ రవళిక, అస్మత్, ప్రవీణ్, శివ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## దరిపల్లి లో ఘనంగా 80 వ స్వాతంత్ర దినోత్సవం

**టీ మీడియా, ఆగస్టు 14, ఖమ్మం రూరల్:**
మండలం సత్యనారాయణపురం కొత్తూరు గ్రామం శివారులో గల దరిపల్లి అనంత రాములు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (బీటెక్ । పాలిటెక్నిక్ । ఎంబీఏ । ఎంటెక్)లి నందు 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా, దేశభక్తి ఉత్సాహంతో నిర్వహించారు. ఉదయం ప్రాంగణం దేశభక్తి గీతాలతో మారుమ్రోగింది. ప్రధాన అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దరివల్లి కిరణ్ జెండా ఎగరవేసి, గౌరవ వందనం స్వీకరించారు.తరువాత తన ప్రసంగంలో ఆయన మాట్లాడుతూ -- “మన దేశ స్వాతంత్ర్యం అనేది మన మహానాయకులు, స్వాతంత్ర్య సమరయోధులు చేసిన అపార త్యాగాల ఫలితం. వారు తమ ప్రాణాలు అర్పించి సాధించిన ఈ స్వేచ్ఛను మనం కాపాడుకోవడం, మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లడం యువత ప్రధాన కర్తవ్యం. క్రమశిక్షణ, సమయపాలన, సమాజ సేవ వంటి విలువలను ఆచరిస్తే మాత్రమే భావితరాలకు ఒక సమృద్ధమైన దేశాన్ని అందించగలుగుతాము” అని అన్నారు.ఈ సందర్భంగా అందరి చేత ప్లాస్టిక్ అవేర్నెస్ మరియు హర్ గర్ తిరంగ మీద ప్లేడ్జి విద్యార్థుల చేత కళాశాల ప్రిన్సిపల్ చేయించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచడం, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, క్యాంపస్ ను గ్రీన్ క్యాంపస్ గా మార్చటం గురించి అందరికి సూచనలు చేశారు.జెండా ఎగర వేసిన అనంతరం కళాశాల ఎన్సిసి విద్యార్థులు అద్భుతమైన గౌరవ వందనం ప్రదర్శించారు.



అనంతరం విద్యార్థులు దేశభక్తి గీతాలు, ప్రసంగాలు, కవితలు, నృత్యాలతో కార్యక్రమాన్ని మరింత ఉత్సాహపరిచారు.ఈ వేడుకల్లో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని, దేశభక్తి ఉత్సాహాన్ని పంచుకున్నారు. కార్యక్రమం ముగింపులో స్వీట్లు పంచి, అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.దరిపల్లి కళాశాల నందు భవిష్యత్తులో వచ్చే ఉద్యోగాలకి అవసరమైన కోర్సులు గుర్తించి వాటిని నూతనంగా పాలిటెక్నిక్ డిప్లమా, బి.టెక్ మరియు ఎంటెక్ కోర్సుల్లో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ – ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్, డేటా సైన్స్, నెట్వర్క్, క్లౌడ్ కంప్యూటర్ అండ్ బిగ్ డేటాలి ప్రవేశపెట్టి తద్వారా ఖమ్మం పట్టణ మరియు రూరల్ మరియు చుట్టుపక్కల ప్రాంతాల విద్యార్థినీ విద్యార్థుల ప్లేస్మెంట్ లక్ష్యంగా కళాశాల పనిచేస్తుందని ఈ సందర్భంగా ప్రిన్సిపల్ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులకు నిర్వహించిన అవుట్ డోర్ గేమ్స్ వాలీబాల్, కబడ్డీ, ఖోఖో అండ్ ఇండోర్ గేమ్స్ క్యారమ్స్, చెస్ పోటీల్లో ప్రధమ ద్వితీయ స్థానం వచ్చిన వారికి కళాశాల కరస్పాండెంట్ దరిపల్లి స్వాతి చేతుల మీదుగా అవార్డులు ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో దరిపల్లి విద్యాసంస్థల అధినేత మరియు ప్రిన్సిపాల్ డాక్టర్ దరిపల్లి కిరణ్, కళాశాల కరస్పాండెంట్ దరిపల్లి స్వాతి, వైస్ ప్రిన్సిపాల్ వెంకట్, వివిధ విభాగాల అధిపతులు వెంకట్రావు, పుల్లయ్య, నీలిమ, డిప్లొమా ఇన్చార్జ్ ఉమారాణి, బి.టెక్ మానస, టీచింగ్ స్టాఫ్ రవళిక, విజయ భవాని, చంద్రకళ, ప్రియ, రమేష్, శ్రీను, రమ్యశ్రీ, కళాశాల సిబ్బంది ప్రవీణ్, ప్రసన్న, రెహమతి, శంకర్, లావణ్య, రజియా మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## త్యాగాలతో సాధించిన స్వాతంత్ర్యాన్ని కాపాడుకుందాం



- **దేశాన్ని విదేశీ పెట్టుబడులకు తాకట్టు పెడుతున్న బీజేపీ**
- **సీపీఎం నేతల విమర్శ**

**టీ మీడియా,ఆగస్ట్15,సింగరేణి(కారేపల్లి):**
ఎందరో మహనీయుల త్యాగాలు,పోరాటాల ఫలితంగా సాధించుకున్న స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కె.నరేంద్ర అన్నారు.శనివారం కారేపల్లిలోని సీపీఐ(ఎం) కార్యాలయం వద్ద 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా కొండబోయిన నాగేశ్వరరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.అనంతరం జరిగిన కార్యక్రమంలో నేతలు మాట్లాడుతూ భగత్సింగ్, రాజ్‌గురు, సుభాష్ చంద్రబోస్, మహాత్మా గాంధీ, పుచ్చలపల్లి సుందరయ్య,డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌తో పాటు ఎందరో మహనీయులు స్వాతంత్ర్య ఉద్యమంలో భాగస్వాములై బ్రిటిష్ పాలన నుంచి దేశ విముక్తి కోసం పోరాడారని పేర్కొన్నారు.స్వాతంత్ర్య ఉద్యమంతో సంబంధం లేని బీజేపీ,దాని అనుబంధ సంఘాలు దేశ స్వాతంత్ర్య పోరాట చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నాయని వారు ఆరోపించారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విదేశీ పెట్టుబడులకు పెద్దపీట వేస్తూ ప్రజా సంపదను ప్రైవేటు శక్తులకు అప్పగిస్తోందని విమర్శించారు.అమరవీరుల పోరాటాలతో సాధించుకున్న హక్కులు,చట్టాలను బలహీనపరిచే విధానాలను కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోందని ఆరోపించారు.స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో ఉద్యోగులు,కార్మికులు, రైతులు,సామాన్య ప్రజలకు వ్యతిరేకంగా అమలవుతున్న విధానాలపై ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు తలారి దేవప్రకాష్,ముక్క సీతారాములు,కరకపల్లి రాయమల్లు,అరెల్లి శ్రీరాములు,తొగర బాబు,మేకల తిరుపతి,శ్రీను,కోటయ్య,సాంబయ్య,సంపత్,సైదులు,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ సెక్యూరిటీ లో తెలంగాణలోని నెంబర్ వన్




**టీ మీడియా, ఆగస్టు 15 ,ఆత్మకూర్ :**
సైబర్ నేరాల నియంత్రణలో వనపర్తి జిల్లా పోలీస్ శాఖ రాష్ట్రస్థాయిలో తన ప్రత్యేక ముద్ర వేసింది. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టి జి ఎస్ బి) ఆధ్వర్యంలో హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఐసీసీసీ భవనంలో నిర్వహించిన “సురక్ష కా తిరంగా -- సైబర్ నేర రహిత తెలంగాణ” రాష్ట్రస్థాయి సైబర్ అవగాహన కార్యక్రమంలో వనపర్తి జిల్లా సైబర్ విభాగం సెక్యూర్డ్ ప్రొఫైలింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి తెలంగాణ రాష్ట్రంలో ప్రథమ స్థానాన్ని సాధించింది. సైబర్ నేరాల నియంత్రణ, అనుమానాస్పద కార్యకలాపాల గుర్తింపు, ప్రజల్లో డిజిటల్ భద్రతపై అవగాహన కల్పించడం, సైబర్ నేరాల పట్ల అప్రమత్తత పెంపొందించడం వంటి అంశాల్లో వనపర్తి జిల్లా సైబర్ విభాగం సమర్థవంతంగా నిర్వహించిన కార్యక్రమాలకు ఈ రాష్ట్రస్థాయి ప్రథమ స్థానం దక్కింది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని శనివారం వనపర్తి జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయిలో సాధించిన ఈ ప్రతిష్టాత్మక విజయానికి గుర్తింపుగా జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, వనపర్తి సైబర్ ఎస్సై, రవిప్రకాష్ లు తెలంగాణ శాసన మండలి చీఫ్ విప్, శాసన మండలి సభ్యులు పట్నం మహేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి చేతుల మీదుగా ఆత్మకూర్ పట్టణ సిఐ శివకుమార్, ఏఐ రోశయ్య ఈ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు రోజురోజుకూ కొత్త రూపాల్లో విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రజలకు సైబర్ భద్రతపై అవగాహన కల్పించడం అత్యంత కీలకమని జిల్లా పోలీస్ శాఖ పేర్కొంది. ప్రజలు అప్రమత్తంగా ఉండటం, అనుమానాస్పద లింకులు, ఫోన్‌కాల్స్, మెసేజ్‌లు, ఫేక్ యాప్స్, ఆన్‌లైన్ పెట్టుబడులు, సోషల్ మీడియా మోసాల పట్ల జాగ్రత్తలు పాటించడం ద్వారా సైబర్ నేరాలను గణనీయంగా అడ్డుకోవచ్చని సూచించింది.సైబర్ నేరాల నియంత్రణలో సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తూ, ప్రజలకు నిరంతర అవగాహన కల్పిస్తూ, సైబర్ భద్రత విషయంలో ముందుండేలా జిల్లా పోలీస్ శాఖ తీసుకుంటున్న చర్యలకు ఈ విజయం నిదర్శనంగా నిలిచింది.తెలంగాణలో సైబర్ భద్రతా కార్యక్రమాల్లో వనపర్తి జిల్లా ప్రథమ స్థానంలో నిలవడం జిల్లా పోలీస్ శాఖకు గర్వకారణమని జిల్లా ఎస్పీ శ్రీమతి సునిత రెడ్డి, ఐపీఎస్. పేర్కొన్నారు. ఈ విజయాన్ని మరింత స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తులో సైబర్ నేరాల నియంత్రణ, ప్రజల డిజిటల్ భద్రత కోసం మరింత పటిష్టమైన చర్యలు చేపడతామని ఆమె తెలిపారు.

## వందేమాతరం ఆలపించని కేరళ

- **కేంద్రం ప్రోటోకాల్‌కు భిన్నంగా స్వాతంత్ర్య వేడుకలు**

**టీ మీడియా, ఆగస్టు 15, ఢిల్లీ బ్యూరో :**
స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు కేరళలో రాజకీయ వివాదానికి దారి తీశాయి. జాతీయ గేయం ‘వందేమాతరం’ ఆలాపనకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన కొత్త ప్రోటోకాల్‌కు భిన్నంగా కేరళ ప్రభుత్వం అధికారిక కార్యక్రమాన్ని నిర్వహించింది. శనివారం తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వీడీ సతీశన్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమం అనంతరం జన గణ మన గీతాన్ని ఆలపించారు. అయితే, ఈ అధికారిక రాష్ట్ర వేడుకలో వందేమాతరం గేయాన్ని మాత్రం ఆలపించలేదు. దీంతో ఈ విషయం రాజకీయంగా చర్చనీయాంశమైంది.

అయితే, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముందే కేరళ ప్రభుత్వ వైఖరిపై ఆసక్తకర పరిణామాలు నెలకొన్నాయి. కొద్ది రోజుల క్రితం, వందేమాతర గేయాన్ని పూర్తి స్థాయిలో ఆలపిస్తారా? అని ప్రశ్నించగా, అందుకు సూటిగా సమాధానం ఇవ్వడానికి సతీశన్ నిరాకరించారు. ‘వేచి చూడండి’ అని సమాధానం ఇచ్చారు. అంతేకాదు, ఈ విషయంపై కాంగ్రెస్, యూడీఎఫ్‌కు స్పష్టమైన వైఖరి ఉందని కూడా తెలిపారు. తీరా స్వాతంత్ర్య వేడుకల్లో వందేమాతరాన్ని పక్కనబెట్టడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. మరోవైపు, కేరళ విద్యాశాఖ కూడా రాష్ట్రంలోని పాఠశాలల్లో జెండా ఎగురవేసి కేవలం ‘జనగణమన’ పాడాలని ఆదేశించింది తప్ప, వందేమాతరం పాడాలని ఎలాంటి సూచనలు చేయలేదు. ఈ విస్మరణ రాష్ట్రంలో ఇప్పటికే రాజకీయ వివాదాన్ని రేకెత్తించింది.



**జాతీయ గేయానికి చట్టపరమైన రక్షణ**

కాగా, వందేమాతరం గేయం ఆలాపనకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఇటీవల వివరణాత్మక మార్గదర్శకాలను జారీ చేసింది. పార్లమెంట్ కూడా జాతీయ గౌరవానికి అవమానం నిరోధక చట్టంలో మార్పులు చేసి జాతీయ గేయానికి చట్టపరమైన రక్షణ కల్పించింది. నిర్దేశిత అధికారిక, ఆచార కార్యక్రమాల్లో జాతీయ గేయాన్ని ఆలపించాల్సి ఉంటుంది. ఒకే కార్యక్రమంలో జాతీయ గేయం, జాతీయ గీతం రెండింటినీ ఆలపించే సందర్భంలో ముందుగా ‘వందేమాతరం’, ఆ తర్వాత ‘జనగణమన’ పాడాలని జులై 9న కేంద్రం ఉత్తర్వుల్లో పేర్కొంది. అదే సమయంలో జాతీయ గేయాన్ని ఆలపించకుండా ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం, కార్యక్రమాన్ని భంగం కలిగించడం శిక్షార్హంగా పరిగణించేలా చట్టంలో మార్పులు చేసింది. జాతీయ గీతానికి సమానంగా ‘వందేమాతరం’కు కూడా రక్షణ కల్పించేలా నిబంధనలు తీసుకొచ్చారు.

**కోజికోడ్ కార్పొరేషన్‌లో రాజకీయ వివాదం**

మరోవైపు, కోజికోడ్ కార్పొరేషన్‌లో రాజకీయ వివాదం స్పష్టంగా కనిపించింది. స్వాతంత్ర్య దినోత్సవం కార్యక్రమంలో మేయర్, ఇతర అధికారులు జనగణమన పాడుతుండగా, అదే సమయంలో బీజేపీ కౌన్సిలర్లు వందేమాతరాన్ని ఆలపించారు. దీంతో రెండు పాటలు ఒకేసారి వినిపించాయి. అయితే, జనగణమన పూర్తయిన తర్వాత కూడా బీజేపీ కౌన్సిలర్లు వందేమాతరం ఆలపించడం కొనసాగించారు. దీనిపై ఇతర కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. రెండింటిని ఏకకాలంలో ఆలపించడం తగదని, అధికారిక కార్యక్రమానికి అంతరాయం కలిగించిందని అన్నారు. మరోవైపు, రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తోందని బీజేపీ ఆరోపించింది. వందేమాతరానికి మరింత ప్రాధాన్యం ఇవ్వాలని కోరింది. కేంద్రం ఆదేశాల అమలు విషయంలో అధికార పక్షమైన కాంగ్రెస్?, ప్రతిపక్ష బీజేపీ మధ్య పరస్పర విరుద్ధ వైఖరులు ఉండడంతో ఈ వివాదం స్పష్టమైన రాజకీయ కోణాన్ని సంతరించుకుంది.

**ఢిల్లీలోనూ వందేమాతరం వివాదం**

ఇదిలా ఉండగా, ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో వందేమాతరం గేయాన్ని ఆలపించారు. అయితే అక్కడి వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో ప్రస్తుతం వైరల్? అవుతోంది. అందులో కాంగ్రెస్ సీనియర్ నేతలు సోనియా గాంధీ, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సహా పలువురు నేతలు వందేమాతరం ఆలాపన కొనసాగుతున్న సమయంలో అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు లేదా దాన్ని ఆపాలని సూచిస్తున్నట్లు కనిపిస్తున్న వీడియో ప్రస్తుతం చర్చనీయాంశమైంది.

## ఎఫ్‌బీవో నవీన్ కుటుంబాన్ని పరామర్శించిన సీపీఎం నేతలు

- **కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలి**
- **వేటగాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలి**

**టీ మీడియా,ఆగస్ట్15,సింగరేణి(కారేపల్లి):**
వన్యప్రాణుల వేట కోసం వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగలు తగిలి మృతి చెందిన అటవీ శాఖ ఉద్యోగి బానోత్ నవీన్ కుటుంబాన్ని సీపీఐ(ఎం) నేతలు శనివారం పరామర్శించారు.సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్య వీరభద్రం,జిల్లా కమిటీ సభ్యుడు కొండబోయిన నాగేశ్వరరావు కారేపల్లి మండలం వెంకట్యాతండాలోని నవీన్ ఇంటికి వెళ్లి ఆయన తల్లిదండ్రులు మాజీ ఎంపీపీ బానోత్ దేవ్లానాయక్,సర్పంచ్ బానోత్ బూలి,భార్య, పిల్లలను పరామర్శించి ఓదార్చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో నవీన్ మృతి చెందడం బాధాకరమన్నారు. ఆయన మృతికి కారణమైన వేటగాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.భవిష్యత్తులో ఇలాంటి



ఘటనలు పునరావృతం కాకుండా అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణుల అక్రమ వేటను అరికట్టేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కోరారు.నవీన్ కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలవాలని,కుటుంబంలో అర్హులైన వారికి ప్రభుత్వ ఉద్యోగం,రూ.కోటి ఎక్స్‌గ్రేషియా,బీమా సొమ్ముతో పాటు ఇతర అన్ని రకాల సహాయాన్ని త్వరితగతిన అందించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కె.నరేంద్ర, నాయకులు తలారి దేవప్రకాష్,రేగళ్ల మంగయ్య,న్యాయవాది నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.